క్లుప్తంగా

ఆహ్వానం



ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘం నాయకులు

నర్సాపూర్: ఈనెల 15న చేపట్టే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో హాజరుకావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. శనివారం బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం ప్రతినిధులు చత్రునాయక్, రాంచందర్, సామ్యానాయక్, విజయ్, ధన్‌సింగ్, రమేశ్, తారాసింగ్, వాగ్యానాయక్, రవి, చెన్న, పంతులు తదితరులు ఎమ్మెల్యేను కలిసి నర్సాపూర్‌లో ఈనెల 15న చేపట్టే సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని వారు కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుప్రజ

టేక్మాల్(మెదక్): టేక్మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ నాయికోటి సుప్రజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పట్నం ప్రమీల, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, డైరెక్టర్ సాదు కిషన్, నాయకులు చింతరవి, కమ్మరి సిద్ధయ్య, భాస్కర్, పట్నం రాములు, శివయ్య, బాలయ్య, సాయిలు, పోచయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో ఆదివారం నియోజక వర్గ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రవినాయక్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పోటీలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో రెండు రోజుల పాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు పాల్గొని ప్రతిభ చాటాలన్నారు.

బదిలీలు సహజం



ఎస్‌ఐలను సన్మానిస్తున్న పోలీస్ స్టేషన్ సిబ్బంది

నర్సాపూర్: బదిలీలు సహజమని ఎస్ఐ గంగరాజు అన్నారు. పట్టణ ఎస్ఐ గంగరాజు సిద్దిపేట జిల్లాలోని భూంపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కామారెడ్డి జిల్లా మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన శివకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన గంగరాజు నర్సాపూర్‌లో రెండేళ్ల మూడు నెలల పాటు పని చేశారు. కాగా ఎస్ఐలు గంగరాజు, శివకుమార్‌లను పోలీస్‌స్టేషన్ సిబ్బంది సన్మానించి, గంగరాజుకు వీడ్కోలు పలికి శివకుమార్‌కు స్వాగతం పలికారు.

నేడు రాజిపేటలో బీజేపీ కార్నర్ మీటింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 12న మండల పరిధిలోని రాజిపేటలో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజీపేట రాజేందర్, మండల పార్టీ అధ్యక్షుడు రాకేశ్ తెలిపారు. మండల ఇన్‌చార్జ్, నర్సాపూర్ మున్సిపాల్ కౌన్సిలర్ గోడ రాజేందర్‌తో పాటు అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఇతర బీజేపీ నాయకులు పాల్గొంటారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికి ప్రచారం చేయడంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పాలన గురించి వివరిస్తామన్నారు. ఈనెల 12 రాజిపేటలో, 14న బూరుగడ్డలో, 16న కౌడిపల్లిలో, 19న తిమ్మాపూర్‌లో, 20న కొట్టాలలో, 23న దేవులపల్లిలో, 25న వెంకట్రావ్‌పేటలో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తామని వివరించారు.

ఉత్తమ ర్యాంకులు సాధించాలి

దుబ్బాక: మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి షఫీఉల్లా సూచించారు. హైదరాబాద్‌లోని మైనార్టీ ఉన్నత కార్యాలయంలో దుబ్బాక మైనార్టీ పాఠశాల 2023 కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఇంటర్మీడియట్‌లో అన్నీ సీట్లు భర్తీ అయ్యేలా ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరును తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

ఆలయాల్లో భక్తుల సందడి



చిన్నశంకరంపేట(మెదక్): జంగరాయిలోని దుర్గామాత ఆలయంలో..



శివ్వంపేట(నర్సాపూర్): ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లా ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. దాతల సాయంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తదితరులు ఉన్నారు.

దుర్గామాత ఆలయంలో..

చిన్నశంకరంపేట(మెదక్): టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ మండల కేంద్రం చిన్నశంకరంపేటలో పర్యటించారు. శనివారం మండలంలోని జంగరాయి గ్రామంలో ఎంపీపీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్ గౌడ్, మాజీ సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఉన్నారు. అనంతరం చిన్నశంకరంపేట మాజీ సర్పంచ్ రామ కిష్టయ్యను ఆయన నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

పేద కుటుంబాలకు చేయూత

శివ్వంపేట(నర్సాపూర్): పలు పేద కుటుంబాలకు జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో శనివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి, రూ. 5 వేల నగదు నిత్యావసర సరుకులు అందజేశారు. శివ్వంపేటకు చెందిన లక్ష్మీనర్సింలు దంపతుల కూతురు వివాహానికి రూ.10 వేల నగదు అందజేశారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన సేవారత్న అవార్డు గ్రహీత బండారు సంతోషగంగాధర్ సూరారం గ్రామానికి చెందిన పేద కుటుంబానికి చెందిన లాస్య పెళ్లికి పుస్తె మట్టెలతో పాటు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, పార్వతీసత్యం, బీఆర్ఎస్ నాయకులు గౌరీశంకర్, అశోక్, ఖాదీర్, రాజు తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

వైభవంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని జంగరాయి గ్రామంలో దుర్గామాత ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అఖండ దీపారాధన, చండీహోమం, నిర్వహించారు. ఈ ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ జ్యోతి, రవీందర్‌రెడ్డి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

'మా భూమి ఇప్పించండి'

శివ్వంపేట(నర్సాపూర్): వంశపారపర్యంగా వచ్చిన పట్టా భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, మా భూమి మాకు ఇప్పించాలని మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు గుర్రు శివయ్య శనివారం అన్నారు. గ్రామ పరిధిలో సర్వే నంబర్ 349లో 1–37 గుంటల భూమిని అక్రమార్కులు ఆక్రమించారన్నారు. ఈ విషయంపై రాష్ట్ర స్థాయి అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ సూమోటోగా స్వీకరించి అటవీ, రెవెన్యూ సిబ్బంది పలుమార్లు జాయింట్ సర్వే చేసినా.. తన భూమి చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్ నుంచి శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు



కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చండూర్ గ్రామంలో శివమాల ధరించిన శివస్వాములు శ్రీశైలం బయలు దేరుతున్నామని గురుస్వామి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కార్యక్రమంలో భాగంగా శివస్వాములు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి మందిరంలోని స్వామివారికి పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణలో ఇరుముడులు ధరించి, గ్రామంలోని వీధివీధిన ఊరేగించి శ్రీశైలానికి బయలుదేరామన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రాంరెడ్డి, శివస్వాములు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్, బాగయ్య, అంజిరెడ్డి, మల్లేశం, మహిపాల్‌రెడ్డి, చంద్రయ్య, విష్ణు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని శివస్వాములు శనివారం శ్రీశైలం తరలివెళ్లారు. కౌడిపల్లిలోని శ్రీఅభయ సీతారామాలయంలో శివస్వాములు మండలం పాటు శివస్వాములు శివదీక్ష చేశారు. శనివారం స్థానిక మల్లికార్జున స్వామి ఆలయంలో మనోహర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో శివస్వాములు పూజలు చేసి, శ్రీశైల యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కును అందిస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బీజేపీ నాయకులు అందజేశారు. చేగుంటకు చెందిన దివికొండ కాశీనాథ్‌కు రూ.15వేలు, శివానంద్‌కు రూ.7500, అనుసూజకు రూ.15వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంజూరీ చేయించగా, లబ్ధిదారులకు అందజేసినట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సంతోశ్‌రెడ్డి, సాయిరాజ్, భిక్షపతి, భిక్షపతి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో కార్డన్ సెర్చ్

25 వాహనాలు సీజ్

రేగోడ్(మెదక్): మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో శనివారం ఉదయం అల్లాదుర్గం సీఐ జార్జ్, రేగోడ్ ఎస్ఐ సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని జల్లెడ పట్టారు. ఒకేసారి సుమారు 37 మంది పోలీసులు గ్రామంలో తనిఖీ చేశారు.

25 వాహనాలు సీజ్

మండలంలోని కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో సరైన ధ్రువ పత్రాలు లేని బైక్‌లు 21, ఆటోలు 3, ఫోర్ వీలర్ ఆటో ఒకటి సీజ్ చేసినట్లు అల్లాదుర్గం సీఐ చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ తెలిపారు. కొండాపూర్ గ్రామంలో కార్డెన్ సెర్చ్ అనంతరం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా వచ్చే ఫోన్‌లు, లింకులను యాక్సెప్ట్ చేయకూడదని సూచించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు. రోడ్డు భద్రతా, షీ టీం గురించి వివరించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానికులు రూ.55వేలు ఇవ్వడంపై వారిని ఆయన అభినందించారు.



వాహనాలను సీజ్ చేసిన దృశ్యం



మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ జార్జ్

ఘనంగా లక్ష్మీనర్సింహ స్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీ.కొండాపూర్ సింగరాయగుట్ట లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించిన రథంలో ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు చేగుంటతో పాటు భూంపల్లి, మిరుదొడ్డి మండలాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు రాజిరెడ్డి, సర్పంచ్ బాలనర్సు, ఉపసర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ గూటం నవీన్‌తో గ్రామస్తులు ఉన్నారు.

నిరుద్యోగులకు పని కల్పించాలి

- ఐదు నెలల నుంచి దీక్ష చేస్తున్న వైనం
- స్పందించని అధికారులు



దీక్ష చేస్తున్న కార్మికులు

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నఘనపూర్ శివారులోని ఇండియన్ మేడ్ లిక్కర్(ఐఎంఎల్)డిపోలో నిరుద్యోగ యువకులకు హమాలి పని కల్పించాలంటూ చేపట్టిన నిరవధిక దీక్ష శనివారంకు ఐదు నెలలకు చేరింది. ఈ సందర్భంగా దీక్ష చేస్తున్న యువకులు మాట్లాడుతూ.. నిరుద్యోగులను అధికారులు ఆట బొమ్మలుగా చూస్తున్నారని, తాము ఉద్యోగాలు అడగడం లేదని, జీవనోపాధి కోసం పని కల్పించాలని కోరుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డిపోలో హమాలి పని కల్పించాలంటూ అవసరమైన ప్రతీ ఒక్కరి దగ్గరకు వెళ్లినా.. తమకు మాత్రం ఇప్పటికీ న్యాయం జరగలేదని వాపోతున్నారు. ఈ విషయంలో ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించకుంటే త్వరలోనే డిపో ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని యువకులు హెచ్చరించారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తూప్రాన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బైండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రపంచ మేధావిని ఒక కులానికి అంకితం చేసి మాట్లాడడం సిగ్గు మాలిన చర్యగా ఖండించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, హమార ప్రసాద్‌పై అట్రాసిటీ కేసు, దేశద్రోహిగా గుర్తించి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బైండ్ల సంక్షేమ సంఘం నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, చెట్లపల్లి యాదగిరి మాదిగ, సర్గల పరశురాములు మాదిగ, నర్సింలు, రమేశ్, కొండయ్య, జానీ, మహేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలని హోళియదాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శాఖమూరి యాదగిరి డిమాండ్ చేశారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

తూప్రాన్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని బీఆర్ఎస్ యూత్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను శనివారం మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. క్రీడలతో మానసికంగా ఉల్లాసం కల్గుతుందన్నారు. యువత చదువులతో పాటు క్రీడాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్స్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, కౌన్సిలర్ మామిడి వెంకటేష్, సత్యలింగం, తలారి మల్లేశ్, బొంది వెంకట్‌గౌడ్, ఏర్పుల లక్ష్మణ్, సర్గల శ్రీనివాస్, బండెల నరేశ్, ఆర్గనైజర్స్ శ్రీకాంత్, నానీ వెంకట్, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్

రోడ్డుకు అడ్డంగా మ్యాన్ హోల్స్

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. దీంతో జనాలు చాలా అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని ఒకటో వార్డులో అండర్ డ్రైనేజీ నిర్మాణాలు నిర్మిస్తుండగా, మ్యాన్ హోల్స్ మాత్రం సీసీరోడ్డు కంటే ఎత్తులో నిర్మిస్తున్నారు. ఫలితంగా ఇరుకుగా ఉన్న వీధుల్లో మ్యాన్‌హోల్ అడ్డంకిగా మారి, జనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంలో పంచాయతీ రాజ్ ఏఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా... గ్రామాన్ని సందర్శించి జనాలకు ఇబ్బంది లేకుండా మ్యాన్‌హోల్స్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రుక్మాపూర్‌లో అడ్డదిడ్డంగా నిర్మిస్తున్న మ్యాన్‌హోల్ నిర్మాణాలు

రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశపాలన సాగిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం రామాయంపేటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. ఎన్నికలముందు సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మాయ మాటలతో కాలం వెళ్లదీస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న నిధులను ఇష్టారీతిన ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. రామాయంపేటలో అభివృద్ధి జాడలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నాయకులు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. పట్టణంలో అసంపూర్తి రహదారులు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, మినీ ట్యాంక్ బండ్, డిగ్రీ కళాశాల మంజూరు వంటి సమస్యలకు పరిష్కారం దొరకలేదని వివరించారు. సమావేశంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, కౌన్సిలర్ అనిల్‌కుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు లావణ్య, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జహీరుద్దీన్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు బైరం సిద్దరాంలు, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాం ముత్తయ్య, నవాత్ రాజేంద్రప్రసాద్, ఇతర నాయకులు స్వామి, ఎల్లంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొండపాక(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీరోడ్డు పనులను సర్పంచ్ కోల శ్రీనివాస్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోల సద్గుణ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రమయంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టిందన్నారు. పనులు పారదర్శకంగా జరిగేలా కాంట్రాక్టర్ చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సత్తమ్మ, నాయకులు కోల శ్రీనివాస్, రెడ్డమైన రమేశ్, శివరాత్రి బాబు, కృష్ణ, తూం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సద్గుణ